# సింగిల్ పేజీ కథలు

## పెళ్లికూతురు

**రాధకివ్వాళ పెళ్లిచూపులు. ఇప్పటికిది నాలుగవది. ముగ్గురికి నచ్చనిది ఈ నాల్గవవాడికి నచ్చుతుందా! ఒకతనికి చదువు కావాలట, ఒకతనికి అందం కావాలట, ఒకతనికి నౌకరీ చేసే అమ్మాయి కావాలట, వీటన్నింటికి తోడు కట్నం సరేసరి, పైగా లాంచనాలు ఉండనే ఉన్నాయి.**

అసలు ఈ మగపెళ్లికొడుకులు నాకు నచ్చద్దూ! ఈ మాట ఎవరు పట్టించుకొంటారు. పెద్దగా చదువుకోకపోవడం తను చేసిన తప్పు. పదవ తరగతి తరువాత తను చదువుకొంటానంటే పెద్దగా చదివి నువ్వేమయినా ఉద్యోగాలు చేస్తావా అని ఇంట్లో వాళ్లే వద్దన్నారు. తన పెళ్లయితే రిటైరవ్వబోతున్న తండ్రి గుండెల్లపై బరువు దిగిపోయినట్లే.

"రాధా ఇంకో గంటలో వాళ్లు వస్తారు, తొందరగా తయారుకావాలి" పురమాయించింది వదిన.

"రానివ్వు. ఇలానే ఉంటాను" మొండిగా చెప్పింది రాధ.

"అట్లంటే ఎలాగమ్మాయి, అబ్బాయికి నువ్వు నచ్చద్దూ"

"మరి ఆ అబ్బాయి నాకు నచ్చద్దా?"

"నీ నచ్చుడెవరిక్కావాలి. అబ్బాయికి నువ్వు నచ్చాలిగాని" సమాధానమిచ్చింది వదిన.

"ఇంతకు ఆ మొ(న)గాడు ఏం చదివాడట, ఏం చేస్తున్నాడట.."

"యం.యస్సీ. చదివాడట. ఏదో ప్రైవేటు మందుల కంపెనీలో మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు"

"అంటే సంచారజీవి అన్నమాట"


"మరి ఎలాంటి వాడు కావాలి?"

"నాకు నచ్చినవాడు, నేను మెచ్చినవాడు, నన్ను మెచ్చినవాడు కావాలి"

"అలాంటి కోరుకున్న మొగుడు దొరకడానికి ఇదేమన్నా సినిమానా, నవలనా? బతుకంటేనే అడ్జస్ట్ అయిపోవాలి"

"నిజమే అడ్జస్ట్ అయిపోవాలి. నువ్వు పోలేదా మా అన్నయ్యతో, ఎందుకు ఆ బండరాయిలా బ్రతకడం" అని కాస్త దెప్పిపొడుపుగా చెప్పింది వదినతో రాధ.

"అందరికీ చేతనవుతుందా నీలా మాట్లాడటం, నువ్వు మాటలతోనే పొద్దుపుచ్చుతున్నావు, నాలుగు రోజులాగు నీకే తెలుస్తుంది. ఇల్లు, పిల్లలు, సంసారం, మొగుణ్ని కొంగుకు కట్టేసుకుని తిరుగంగ నేను చూడనా" అంది వదిన సమాధానంగా.



"చూస్తూ ఉండు నేనేం చేస్తానో" అంటూ ఓ మాట పారేసింది రాధ.

"అంటే.." అంటూ ఆశ్చర్యంగా చూసింది వదిన.

"ఏమీలేదు. ఈ పెళ్లి లేదు, పెళ్లిచూపులు లేవు, ఇంతకు ఆ వచ్చే ఆయనకు నేను నచ్చద్దూ, కట్నకానుకలు నచ్చద్దూ, అప్పుడు చూస్తాలే" అంది రాధ.

"ఏమో అమ్మా నీతో పెట్టుకొంటే ఒడువదు, నాకు వంటింట్లో పనుంది, అరగంటలో తయారై కూచో, పుస్తకాలు చదివిన జ్ఞానం కదా నువ్వు అన్నీ అట్లే మాట్లాడుతావు"

"పుస్తకాలు చదివి నేనేం చెడిపోలేదులే. ఆత్మవిశ్వాసాన్ని పెంచుకున్నాను. తెలివైన ఆడపిల్లలా ఆలోచిస్తున్నాను, ఆసలు కట్నం ఇచ్చుకొంటూ నేనెందుకు వెళ్లిపోవాలి ఒకరింటికి. నన్ను నన్నుగా కావాలనుకునే మనిషి దొరికే వరకు నాకు పెళ్లి వద్దు"

"అమ్మబాబోయి. చూస్తే ఎవర్నయినా ప్రేమించినట్టున్నావే. కొంప ముంచుతావా ఏమి?" అనుమానం వెలిబుచ్చింది వదిన.

"నేనేం కొంపముంచే పనులేమీ చెయ్యనులే. నాకు నచ్చిన పనే చేస్తాను, అంతటి మగవాడు దొరికితేగా అప్పుడు ఆలోచించడం"

"ఇప్పుడయితే కానియి ఈ పెళ్లిచూపులు. తరువాతి సంగతులు దేవుడెరుగు" అంటూ వంటింటి పనుల్లోకి వెళ్లిపోయింది వదిన.

తప్పదు కాబట్టి అరగంటలోనే తయారైంది రాధ. రాధ పెద్ద అందగత్తె కాకున్నా చలాకీ అయిన, ఆకర్షణీయమైన అమ్మాయి. స్వతంత్ర భావాలుగల అమ్మాయి. ఇలా అందరి ముందు పెళ్లిచూపుల పేరిట సంతలో పశువులా, గంగిరెద్దులా అలంకరించుకొని కూర్చోవడం బాగనిపించలేదు రాధకు.

పదకొండు గంటల సమయంలో పెళ్లికొడుకు, పెళ్లికొడుకు స్నేహితుడు, తల్లిదండ్రులు, అక్కచెల్లెళ్లు, మేనమామ కట్టగట్టుకొని వచ్చారు రాధను చూద్దామని.

పెళ్లిచూపుల తతంగం మొదలయింది. రాధ ఎంత వరకు చదువుకొందో అడిగారు. ఎలా మాట్లాడుతుందో అని కాసేపు మాట్లాడించి చూశారు. నడక ఎలా ఉందో అని కాసేపు నడిపించి చూశారు రాధను. పెళ్లికొడుకు తల్లిగారు రాధ అరచేతులు పట్టుకొని వేళ్లు, గోళ్లు పరీక్షించి చూసింది. ఇవన్నీ పరీక్షలు ఆ మగ మహారాజుకు ఎందుకు చెయ్యకూడదో, తనకే ఎందుకు చేస్తున్నారో అని

కోపమొచ్చింది రాధకు. రాధ నచ్చిందన్నారు, ఇక కట్నం విషయాలే! మూడు లక్షల రూపాయల కట్నం, హోండా బండి, కలర్ టీవీ, ఫ్రిజ్, ఆడబడుచు లాంచనాలు కావాలన్నారు.

ఇవన్నీ విని "ఓ లక్ష రూపాయల కట్నమైతే ఇచ్చుకొంటాను. కొంత లాంచనాలు చూస్తాను" అన్నాడు రాధ తండ్రి రామయ్య.

ఇది విని తర్వాత చెపుతామని వెళ్లిపోయారు వాళ్లు. వెళ్లి కట్నం చాలలేదని చెప్పలేక, జాతకాలు కుదరలేదని చెప్పి పంపారు. విని బాధ పడలేదు. ఏడవ లేదు రాధ. రాధ తండ్రి మాత్రం తన గుండెలమీది కుంపటి ఎప్పుడు దిగిపోతుందా అని చూస్తున్నాడు. రాధ తల్లి రామలక్ష్మమ్మ ఏమీ తెలియని అమాయకురాలే, అన్నయ్య సుబ్రహ్మణ్యం పట్నం దుకాణంలో గుమస్తా. కాలక్షేపానికి కబుర్లు చెప్పడానికి వదిన, వదిన కూతురు చిట్టి, చదువుకోవడానికి బోలెడు పుస్తకాలు ఇవే రాధ ప్రపంచం.

ఒకనాడు ఓ శుభ ముహూర్తాన మల్లెమొగ్గలా తయారైంది రాధ. వదిన దగ్గరికి వెళ్లి "వదినా వదినా నేను గుడికి వెళ్తున్నాను ఆశీర్వదించు" అంది ఆశగా చూస్తూ.

"ఎందుకు ఇంత ఉదయాన్నే" అడిగింది వదిన.

"కోరుకున్న మొగుడితో పెళ్లి కావాలని.."

"ఎవరబ్బా ఆయన" ఆశ్చర్యంగా అడిగింది వదిన.

"ఏమి చేస్తుంటాడు?"

"బడిపంతులు"

"మంచివాడేనా?"

"మంచివాడే. ఈ రోజు ఉదయం గుడిలో పెళ్లి, నీకొక్కదానికే చెపుతున్నాను. దీవించు నాపై ప్రేముంటే.."

కళ్లతోనే నిండుమనసుతో దీవించింది వదిన.

వదిన ఆశీర్వాదం తీసుకొని ఆత్మతృప్తితో గుడికి బయలుదేరింది రాధ.

**-నబ్బుని లక్ష్మీనారాయణ**
**(కరీంనగర్)**

# రాంగ్ నెంబర్

**రైటర్ గోవింద్‌కి ఏనాటికైనా తను సినీ రచయిత కావాలని కోరిక. అప్పటికే తన కథలు వివిధ పత్రికలలో అచ్చు కూడా అయ్యాయి.**


గోవింద్ స్నేహితులలో అతనిని సినీ రచయితగా చూడాలని, మేము సినీ రచయిత గోవింద్ స్నేహితులం అని గర్వంగా చెప్పుకునేంత స్థాయికి గోవింద్ ఎదగాలని కాంక్షించేవారు.

గోవింద్‌కు అదృష్టం కలిసొచ్చి సినీ రచయితగా అవకాశం లభించింది. తన మొదటి కథ ఆధారంగా తీసిన సినిమా శత దినోత్సవం వేడుక జరుపుకుంది. సినిమా విజయానికి కారణం కథలోని కొత్తదనమే అంటూ ఇండస్ట్రీ వాళ్లంతా గోవింద్‌ను నెంబరు ఒన్ స్థానానికి ఎత్తేశారు.

గోవింద్ బిజీ రైటర్. అంతేకాదు చాలా కాస్ట్లీ రైటర్ కూడా. అతని కథ కోసం ఎంతైనా ఇచ్చి ఎన్ని సంవత్సరాలైనా వేచి ఉండే డైరెక్టర్లు, నిర్మాతలు ఉన్నారు. ఏ సినిమా చూసినా ఇతని కథతో రూపుదిద్దుకున్నది. అతని స్నేహితులు గర్వంగా చెప్పుకునే అంత ఎత్తుకి ఎదిగాడు. ఇప్పుడు అతని జీవన విధానమే మారిపోయింది. కాస్ట్లీ లైఫ్. చేతి నిండా సంపాదన... చేతిలో సెల్‌ఫోన్, ఎక్కడికి వెళ్లాలన్నా కారు.

గోవింద్ హైదరాబాద్ నుండి వైజాగ్ తన నేటివ్ ప్లేస్‌కి వచ్చాడని తెలిసి స్నేహితులంతా వెళ్లి అభినందించారు. గోవింద్ మునుపటి మాదిరిగానే అతని స్నేహితులతో కలిసి తిరిగాడు. వైజాగ్‌లో ఉన్న నాలుగు రోజులు తన స్నేహితుల వద్ద ఏమాత్రం గర్వం ప్రదర్శించకుండా వీళ్లతో కలిసి ఎంజాయ్ చేశాడు.

గోవింద్ వైజాగ్ నుండి హైదరాబాద్ వెళ్లేటప్పుడు తనతో పాటు రైల్వేస్టేషన్‌కి వచ్చిన స్నేహితులకు అతని అడ్రస్, సెల్ నెంబరు ఇచ్చి వెళ్లాడు.



* * *

గోవింద్ ఫ్రెండ్ వెంకట్ కోర్టు పని మీద హైదరాబాద్ వెళ్లాడు. పని అయిపోయిన తరువాత స్నేహితుడ్ని చూడాలని ఆటో మాట్లాడుకుని అడ్రస్ ప్రకారం వెళ్లాడు.

"ఈ పేరు కల వ్యక్తి ఎవరూ ఇప్పటివరకూ ఈ ఇంట్లో అద్దెకు దిగలేదు. ఈయన మాకు తెలీదు" అని ఇంటి ఓనర్ చెప్పాడు.

అతను అంతటితో ఆగక గోవింద్ సెల్‌కి డైల్ చేశాడు.

"హలో!.."

వినగానే "గోవింద్! నేనురా నీ ఫ్రెండ్ వెంకట్‌ని" పట్టలేని ఆనందంతో చెప్పాడు.

"రాంగ్ నెంబర్. నేను మీ గోవింద్‌ని కాను. ఆ పేరు కల వాళ్లెవరూ మా ఇంట్లో కానీ స్నేహితుల్లో కానీ లేరు" అని స్విచ్ ఆఫ్ చేసేశాడు.

అది విన్న వెంకట్ మనసు విలవిల్లాడింది.

వైజాగ్‌కు తిరిగి వచ్చి జరిగిన విషయం స్నేహితులకు చెప్పాడు. వాళ్లు కూడా అదే విధంగా ఖంగు తిన్నామని చెప్పారు.

రైటర్ గోవింద్ కథలతో నిర్మించిన సినిమాలకు ప్రజాదరణ తగ్గింది. ఇదివరకు అతని కథ కోసం క్యూ కట్టిన డైరెక్టర్లూ, నిర్మాతలూ ఇప్పుడతనికి ముఖం చాటేస్తున్నారు.

గోవింద్‌కు కళాతృష్ణ చావక తన కథని తీసుకోమంటూ నిర్మాతల చుట్టూ డైరెక్టర్ల చుట్టూ తిరిగి తిరిగి కూడబెట్టిన సొమ్ము కూడా పోగొట్టుకున్నాడు.

చేతిలో చిల్లిగవ్వ కూడా లేదు.

స్నేహితులు గుర్తుకొచ్చారు.

స్నేహితులకు ఫోన్ చెయ్యాలని, టెలిఫోన్ ఇండెక్స్ తీసి ఫోన్ చేశాడు.

"హలో!.." అని పలికిన గొంతు విని "వెంకట్ నేనురా.. నీ ఫ్రెండ్ రైటర్ గోవింద్‌ని" ఆత్రంగా పలకరించాడు.

"రాంగ్ నెంబర్ నేను మీ వెంకట్‌ని కాను. ఆ పేరు గల వాళ్లు మా ఇంట్లో కానీ నా స్నేహితుల్లో కానీ లేరు" అని ఫోన్ పెట్టేశాడు వెంకట్.

స్నేహితుల మనసుల్లో తను సంపాదించుకున్న స్థానాన్ని తలచుకొని సిగ్గుతో మిగిలినవారెవ్వరికి ఫోన్ చెయ్యలేకపోయాడు.

**-కొరుపోలు గోవిందరావు (లింగాపురం)**